
సాక్షి శ్రీకాకుళం

మంగళవారం • 9 • జూలై • 2024



ఉపాధికి వేతన వేదన

ఉపాధి వేతనదారులకు బకాయిలు చెల్లించడం లేదు. దీనిపై వారు ధర్నాకు దిగారు.

- 8లో



రోడ్డు ప్రమాదంలో..

మడపాం వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ జిమ్ ట్రైనర్ ప్రాణాలు కోల్పోయాడు.

- 8లో

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

మెళియాపుట్టి: దస్త్రాలలో, బిల్లుల్లో ఉన్న వాటికి తగ్గట్లుగా నిల్వలు ఉండాలని విజిలెన్స్ డీఎస్పీ ఎస్.కిరణ్‌కుమార్ అన్నారు. ఆయన సోమవారం మండల కేంద్రంలోని ఎరువులు, పురుగుమందులు విక్రయించే షాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఓ షాపులో రూ.1.4 లక్షలకు సంబంధించిన ఎరువులు ఉన్నప్పటికీ దానికి సంబంధించిన పేపర్స్ లేకపోవడంతో.. విక్రయం నిలుపుదల చేయాలని ఆదేశించారు.

న్యూస్‌రీల్

మెరిట్ జాబితాకు కసరత్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో ప్రవేశానికి మెరిట్ జాబితాను అధికారులు సిద్ధం చేస్తున్నారు. 10వ తరగతి మార్కులు, రిజర్వేషన్ రోస్టర్, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వెయిటేజ్, ప్రత్యేక రిజర్వేషన్లు, కేటగిరీల ఆధారంగా జాబితా సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 11వ తేదీన జాబితా వెల్లడిస్తారు. రాష్ట్రంలో శ్రీకాకుళం, ఇడుపులపాయ, ఒంగోలు, నూజివీడు క్యాంపస్‌లు ఉన్నాయి. ప్రతి క్యాంపస్‌లో ఈడబ్ల్యూఎస్ (ఎకనామికల్లీ వీకర్ సెక్షన్స్)తో కలిపి 1100 సీట్లు ఉన్నాయి. రెండేళ్ల ప్రీ యూనివర్సిటీ కోర్సు+నాలుగేళ్ల ఇంజినీరింగ్‌తో కలిపి ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. మొత్తం నాలుగు క్యాంపస్‌లకు కలిపి 53,863 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వ పాఠశాలల నుంచి 34,154, ప్రైవేట్ పాఠశాలల నుంచి 19,671 దరఖాస్తులు వచ్చాయి. ప్రత్యేక కేటగిరీ విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు భౌతికంగా పరిశీలన పూర్తి చేశారు. శ్రీకాకుళం క్యాంపస్‌కు ఎంపికైన విద్యార్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన స్థానిక క్యాంపస్‌లో ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తారు.

అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్ పోటీల్లో పూర్ణారావుకు పతకాలు



అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్ పోటీల్లో సాధించిన పతకాలతో పూర్ణారావు

టెక్కలి: ఉగాండాలో జరుగుతున్న అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో టెక్కలి మండలం శ్రీరంగం గ్రామానికి చెందిన పారా బ్యాడ్మింటన్ క్రీడాకారుడు చాపర పూర్ణారావు బంగారు, వెండి, బ్రాంజ్ మెడల్స్‌ను సాధించాడు. గతంలో థాయ్‌లాండ్‌లో జరిగిన ప్రపంచ పారా బ్యాడ్మింటన్ పోటీల్లోనూ పూర్ణారావు 2 కాంస్య పతకాలను సాధించాడు. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో పూర్ణారావు పతకాలు సాధించడంపై గ్రామస్తులతో పాటు పలువురు క్రీడాకారులు అభినందించారు.

'విద్యా వసతులు కల్పించండి'



విద్యా వసతులపై ఆర్‌జేడీ విజయభాస్కర్‌కు విన్నవిస్తున్న విద్యార్థినులు

టెక్కలి: తమ పాఠశాలలో ఇంటర్ విద్యార్థినులకు సైన్స్ ల్యాబొరేటరీ, విద్యార్థినులకు యూనిఫాం, మధ్యాహ్న భోజన వసతి కల్పించాలని టెక్కలి బాలికోన్నత పాఠశాల ప్లస్ టు ఇంటర్ విద్యార్థినులు ఆర్‌జేడీ సీహెచ్ విజయభాస్కర్‌కు విన్నవించారు. సోమవారం ఆర్‌జేడీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఇంటర్‌లో కోర్సుల ప్రవేశాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకు ముందు పాఠశాలలో జరుగుతున్న టీచ్ టు లెర్న్ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయనతో పాటు ఉప విద్యా శాఖాధికారి విలియమ్, ఎంఈఓ డి.తులసీరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు ఎస్.శోభారాణి, ఉపాధ్యాయులు కె.వెంకటరమణ, టి.ఆనందరావు తదితరులు ఉన్నారు.

కేజీబీవీలో డయేరియా వ్యాప్తిపై కలెక్టర్ ఆగ్రహం



పిచ్చిమొక్కలతో కోటబొమ్మాళి కేజీబీవీ ఆవరణ

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో డయేరియా వ్యాప్తి చెందడంపై సమగ్రశిక్షా ఉన్నతాధికారులపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. విద్యాలయంలో వెంటనే పారిశుద్ధ్య పనులు చేట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం విద్యాలయాన్ని అధికారుల బృందం పరిశీలించి బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా ఉందని నివేదిక ఇచ్చారు. నాన్ టీచింగ్ స్టాఫ్ నిర్లక్ష్యమే ఇందుకు కారణమని అధికారులు భావిస్తున్నారు. దీంతో కలెక్టర్ వారికి హెచ్చరికలు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రూ.10 లక్షలతో మరుగుదొడ్లకు కొత్తగా పైప్‌లైన్ల ఏర్పాటు, తాగునీటి ట్యాంకుల మరమ్మతు, కాలువల పూడిక తీత వంటివి చేపట్టనున్నట్లు సమగ్ర శిక్ష ఏపీసీ రోణంకి జయప్రకాష్ సోమవారం విలేకరులకు తెలిపారు. సోమవారం జీసీడీఓ నీరజ, ఇంజినీరింగ్ అధికారి రామానుజం, ప్రిన్సిపాల్ లక్ష్మీప్రశాంతి కేజీబీవీలో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.

మాటలే ఉచితం అమ్మకమే వాస్తవం



నూతన ఇసుక విధానం పేరుతో టెక్కలి స్టాక్ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

- ఇసుక ఖరీదే
- జిల్లాలో ఉచిత ఇసుక పాలసీ అమలు ప్రారంభం
- టన్ను ఇసుక రూ.340 చొప్పున రేటు ఖరారు
- కిలోమీటర్‌కు రూ.4.90 ఖరారు చేసిన ఇసుక కమిటీ
- జిల్లాలో టెక్కలి, అంగూరు స్టాక్ పాయింట్ల వద్ద నుంచి విక్రయాలు
- వర్షాలు తగ్గిన తర్వాత సెప్టెంబర్‌లో మళ్లీ కొత్త విధానం అమలుపై ప్రకటన

అరసవల్లి:

ఇసుక ఉచితం.. అంటూ చిలక పలుకులు పలికిన అధికార కూటమి నేతలు.. ఇప్పుడు అసలు సినిమా చూపిస్తున్నారు. పాత షరతులే వర్తించేలా నిర్ణయాలను ప్రకటించేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుంచి కొత్త ఇసుక పాలసీ అమలు ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం తన ఉద్దేశాన్ని సుస్పష్టంగా జనాలకు చెప్పేసింది. ఉచిత ఇసుక పేరిట టీడీపీ, జనసేన, బీజేపీ నేతల జేబులు నింపుకునేందుకు రంగం సిద్ధం చేసింది.

ప్రస్తుతానికి జిల్లాలో ప్రధాన నదులైన నాగావళి, వంశధారతో పాటు మహేంద్రతనయ, బాహుదా నదీ తీరాల్లో వర్షపు ఇబ్బందులు కారణంగా ఇంకా రీచ్‌ల గుర్తింపు జరగలేదు. అయితే గత ప్రభుత్వం హయాంలో జగనన్న కాలనీలకు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు అందజేసేందుకు కొన్ని ప్రాంతాల్లో స్టాక్ పాయింట్ల వద్ద సిద్ధం చేసిన భారీ ఇసుక నిల్వలను మాత్రం ఇప్పుడు వ్యాపార వాణిజ్య అవసరాలకు రవాణా చేసేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసింది.

రెండు స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక సరఫరా

ఇసుక పాలసీ అమల్లో భాగంగా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ మార్గదర్శకాల ప్రకారం ప్రస్తుతానికి జిల్లాలో కొత్తూరు మండలం అంగూరు, టెక్కలిలలో మాత్రమే స్టాక్ పాయింట్లు అందుబాటులో ఉన్నట్లుగా గుర్తించారు. ఇందులో అంగూరులో 40 వేల మెట్రిక్ టన్నులు, టెక్కలిలో 8 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉన్నట్లుగా గుర్తించి సోమవారం నుంచి ఇసుక విక్రయాలు మొదలుపెట్టారు. జిల్లా కమిటీ నిర్ణయాన్ని బట్టి మొదటి ప్రాధాన్యతగా ట్రాక్టర్‌కు లోడు ఎక్కించాలని, తర్వాత ఆరుటైర్ల లారీలకు లోడింగ్ అనుమతించాలని తీర్మానించారు. అయితే తొలిరోజే ఈ నిబంధనలను కాలరాశారు.



టెక్కలి ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఇసుక కోసం రోడ్డు డివైడర్‌పై పడిగాపులు కాస్తున్న ట్రాక్టర్ యజమానులు, కార్మికులు

రోజుకు 750 మెట్రిక్ టన్నులు విక్రయిస్తాం

కొత్తూరు: జిల్లాలోని కొత్తూరు మండలం అంగూరు, టెక్కలి వద్ద ఇసుక నిల్వలు ఉన్నందున ఈ రెండు చోట్ల సోమవారం నుంచి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉచిత ఇసుక విధానం ప్రారంభించినట్లు మైన్స్ డీడీ ఎస్‌కేవీ సత్యనారాయణ తెలిపారు. అంగూరు వద్ద ఆయన మాట్లాడారు. మెట్రిక్ టన్ను ధర రూ.340గా ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. ఒక్కో పాయింట్ వద్ద రోజుకు 750 మెట్రిక్ టన్నులు విక్రయిస్తామన్నారు.

గతంలో ప్రభుత్వానికే 'ఇసుక' ఆదాయం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇసుక ద్వారా నేరుగా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా ఇసుక పాలసీని అమలు చేశారు. అలాగే సామాన్యులకు అందుబాటు ధరలోనే ఇసుక వినియోగానికి వీలుగా నాటు బండ్లతో ఉచితంగా ఇసుకను సరఫరా చేయించారు. అలాగే ఇసుక రీచ్‌లు, థర్డ్ ఆర్డర్ స్ట్రీమ్స్‌లో కూడా ఇసుకను స్టాక్ పాయింట్లకు తెప్పించి టన్ను రూ.475 చొప్పున ఇసుక విక్రయాలు జరిపారు. అయితే దీంతో ఈ ఇసుక విక్రయాల ద్వారా వచ్చిన ఆదాయం అంతా ప్రభుత్వ ఖజానాకి చేరేది. కానీ ఇప్పుడు పరిస్థితి అలా కనిపించడం లేదు.

టన్ను ధర రూ.340

జిల్లా ఇసుక కమిటీ నిర్ణయం మేరకు జిల్లాలో ప్రస్తుతానికి టన్ను ఇసుకకు రూ.340 చొప్పున వసూలు చేయాలని, అలాగే రవాణా వాహనానికి కిలోమీటర్‌కు రూ.4.90 చెల్లించాలని నిర్ణయించారు. అయితే ఈ ధరల ప్రకారం ఒక్కో ట్రాక్టర్‌కు నాలుగు నుంచి ఐదు టన్నుల ఇసుక రవాణాకు వీలుంది. దీంతో ట్రాక్టర్ ఇసుక ధర రూ.1700 వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఇది రవాణాకు అదనం. మొత్తంగా చూస్తే ఒక్కో ట్రాక్టర్ ఇసుక ధర రూ.2200 నుంచి దూరాన్ని బట్టి రూ. 3000 వేల వరకు ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతానికి చూస్తే శ్రీకాకుళం నుంచి కొత్తూరు 65 కిలోమీటర్ల దూరం, టెక్కలి అయితే 50 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడి వారు అక్కడ నుంచి ఇసుకను తెప్పించుకోవాలంటే... టోల్‌గేటు చార్జీలతో సహా తడిసిమోపెడవుతుంది. ఈ రెండు మూడు నెలల వరకు వర్షాలు కారణంగా ఎలాంటి ప్రధాన నదుల వద్ద రీచ్‌ల గుర్తింపు చేపట్టడం లేదు. అయితే వచ్చే సెప్టెంబర్ నుంచి మళ్లీ కొత్త ఇసుక విధానాన్ని అమలు చేస్తున్నట్లుగా అధికారులు చెబుతున్నారు. దీంతో ఇప్పటి ధరలకు రెట్టింపుగా వడ్డింపులుంటాయని కూడా చెబుతున్నారు.



టెక్కలి ఆర్టీసీ డిపో వద్ద స్టాక్ పాయింట్ నుంచి ఇసుక కోసం కిలోమీటర్ల మేర నిలిచిపోయిన ట్రాక్టర్లు

టెక్కలి వద్ద పడిగాపులు

టెక్కలి:

ఉచితం.. ఉచితం.. అని ఆశపెట్టి కూటమి నాయకులు ఉసూరుమనిపించారని ఇసుక వాహనదారులు అన్నారు. నూతన ఇసుక విధానం పేరుతో సోమవారం టెక్కలి ఇసుక స్టాక్ పాయింట్ నుంచి ఉచితంగా ఇసుకను పంపిణీ చేస్తామంటూ చేసిన ప్రకటనలతో, టెక్కలి చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన ట్రాక్టర్ల యాజమానులు, కార్మికులు ఉదయం 6 గంటల నుంచి స్థానిక ఆర్టీసీ డిపోకు ఆనుకుని ఉన్న ఇసుక స్టాక్ పాయింట్ వద్దకు చేరుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఇసుక పంపిణీ చేస్తామని మైన్స్ అధికారులు చెప్పడంతో, ఇసుక స్టాక్ పాయింట్ నుంచి తొలుసూరుపల్లి వెళ్లే మార్గం వరకు కిలోమీటర్ల మేర బారులు తీరారు. ఇదే సమయంలో మైన్స్ అధికారులు నూతన ఇసుక విధానంతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. అందులో టన్ను ఇసుక రూ.340కు పంపిణీ చేస్తామని ఉండడంతో, కొంత మంది ఖంగుతిన్నారు. ఉచితంగా ఇసుక ఇస్తామన్నారు.. ఏదో కొంత మొత్తంలో ఫీజు తీసుకుంటారని అనుకుంటే ఏకంగా రూ.1700కు పైగా అవుతోందని చర్చించుకున్నారు. పోనీ డబ్బులు ఇచ్చి తీసుకుందామంటే సాయంత్రం ఆరు వరకు ఇవ్వనేలేదు. అంత సేపు ఎదురుచూశాక ఇసుక పంపిణీ చేయడం లేదంటూ అధికారులు చెప్పడంతో, ఉదయం నుంచి పడిగాపులు కాసిన వారంతా ఉసూరుమంటూ వెనుదిరిగారు.

మీకోసంలో 235 అర్జీల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: కలెక్టర్‌గా స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. వచ్చిన వినతులపై అక్కడికక్కడే టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఆయా మండలాల అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఆయనతోపాటు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, ప్రత్యేక ఉప కలెక్టర్ రామ్మోహన్ రావు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. ఆఫ్‌లైన్ ద్వారా 92, ఆన్‌లైన్ ద్వారా 143 కలిపి మొత్తం 235 దరఖాస్తులు వచ్చాయి. అలాగే ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్స్‌కి కలెక్టర్ గుర్తింపు కార్డులు అందజేశారు. ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే జిల్లాలో వివిధ పత్రికల్లో ప్రచురితమైన ప్రతికూల వార్తలపై సమీక్షించారు. ప్రతికూల వార్త అందిన 24 గంటల్లో పూర్తి వివరాలతో వివరణ ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.

బాధితులకు న్యాయం చేకూర్చాలి



యువతి మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను చట్టపరిధిలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేకూర్చాలని ఎస్పీ జీఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీకోసం గ్రీవెన్స్‌సెల్‌లో 37 ఫిర్యాదులు ఎస్పీ స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడుతూ సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఎస్పీతో పాటు ఫిర్యాదులను అదనపు ఎస్పీ ప్రేమ్‌కాజల్ స్వీకరించారు.

'ఫ్రైడే.. డ్రైడే తప్పక పాటించాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ వంటివి ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ప్రతి శుక్రవారం అందరూ విధిగా డ్రైడే పాటించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా అధికారులతో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో శుక్రవారంతో పాటు ప్రతి మంగళవారం తమ కార్యాలయం లేదా సంస్థల పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణకు పెద్దపీట వేయాలని పిలుపునిచ్చారు. పెద్ద ఎత్తున మంగళ, శుక్రవారాల్లో నిర్వహించాల్సిన పనులపై ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ప్రభుత్వ సూచనలను సలహాలను పాటించాలని కలెక్టర్ కోరారు. జిల్లాలోని కస్తూర్బా పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాల్లో పారిశుద్ధ్యం పర్యవేక్షించేందుకు ఆయా ఎంపీడీఓలు ప్రత్యేక అధికారులను నియమించాలని ఆదేశించారు. కాలువలను రోజూ శుభ్రం చేయాలని, ఎక్కడా చెత్త కనిపించకూడదని, ఎప్పటికప్పుడు చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు.



శ్రీకాకుళంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, తదితరులు

ఓ మహాత్మా.. ఓ మహర్షి

వైఎస్ఆర్ అనే మూడు అక్షరాల మంత్రాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు గుండెతో పఠించారు. ఆ మహనీయుడి 75వ జయంతి సందర్భంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంక్షేమ రాజ్యానికి రాజశేఖరుడు వేసిన పునాదులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. ఆయన ఆశయ సాధనకు పురుడు పోసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ద్వారా బడుగు బలహీన వర్గాలకు అండగా నిలబడతామని ప్రతిజ్ఞ చేశారు.

వైఎస్సార్ మరణం రాష్ట్రానికి ఓ శాపం

వైఎస్ రాజశేఖర రెడ్డి మరణం రాష్ట్రానికి శాపమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శ్రీకాకుళంలోని ఏడురోడ్ల కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేశారు. పార్టీ శ్రేణులతో ర్యాలీ నిర్వహించారు. జలయజ్ఞం ద్వారా రైతు బాంధవుడిగా, 108 ద్వారా ప్రాణదాతగా, ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా విద్యాసంస్కర్తగా పేదల హృదయాల్లో ఆయన చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. తండ్రి ఆశయ సాధనే లక్ష్యంగా జగన్‌మోహన్‌రెడ్డి 2019–24 మధ్య కాలంలో రాష్ట్రంలో పారదర్శక పాలన అందజేశారని గుర్తు చేశారు. టీడీపీ మాత్రం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులే లక్ష్యంగా దాడులు, విధ్వంసాలకు పాల్పడుతోందని అన్నారు. వీటిని ధైర్యంగా ఎదుర్కొంటామని తెలిపారు. మూలపేట పోర్టు, కిడ్నీ ఆస్పత్రి, ఫిషింగ్ హార్బర్లు, ఉద్దానం మంచినీటి పథకం వైఎస్సార్‌సీపీ పనితీరును ప్రజలకు గుర్తు చేస్తుంటాయని పేరాడ తిలక్ అన్నారు.

-శ్రీకాకుళం (పీఎన్ కాలనీ)

ఘనంగా జయంతి



కిడ్నీ రీసెర్చ్ సెంటర్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

వైఎస్సార్ జయంతిని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో పలాస మున్సిపాలిటీ వ్యాప్తంగా నిర్వహించారు. కాశీబుగ్గ సంత మైదానంలో కార్యక్రమం నిర్వహించడంతో పాటు పలాస–కాశీబుగ్గ మార్కెట్ ఆవరణలో ఉన్న వైఎస్సార్ స్క్వేర్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కిడ్నీ ఆస్పత్రి వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద కూడా జయంతి వేడుకలు నిర్వహించారు.

- కాశీబుగ్గ

పేదల గుండె చప్పుడు వైఎస్సార్

పేద ప్రజల గుండె చప్పుడు వైఎస్ రాజశేఖర రెడ్డి అని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలసలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు ర్పించారు. పార్టీ క్యాడర్‌తో కలిసి కేక్ కట్ చేశారు. ఖద్దరు లాల్చీ, మొహంలో చెరగని చిరునవ్వు, ఓదార్పే తత్వం వీటన్నింటి ట్రేడ్‌మార్క్ వైఎస్సార్ అని అన్నారు.

-ఆమదాలవలస



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం



హిరమండలంలో వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నమస్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

సంక్షేమానికి ఆద్యుడు

రాష్ట్రంలో సంక్షేమానికి ఆద్యుడు వైఎస్ రాజశేఖర రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించిన వైఎస్సార్ జయంతి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. హిరమండలం బస్టాండ్ జంక్షన్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు.

- హిరమండలం

మహానేతను మరువలేం

మహానేత వైఎస్సార్‌ను మరువలేమని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ తెలిపారు. జీఆర్ పురం పాత పోలీస్‌స్టేషన్ సర్కిల్, పైడి భీమవరంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రణస్థలం పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేశారు. వైఎస్సార్ అమలు చేసిన సంక్షేమాలను గుర్తు చేశారు.

- రణస్థలం



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

సంక్షేమానికి పునాది



ఇచ్ఛాపురం ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు

రాష్ట్రంలో సంక్షేమ పాలనకు పునాది వేసింది మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి అని జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఇచ్ఛాపురం బస్టాండ్ కూడలి సోమవారం వైఎస్సార్ జయంతి కార్యక్రమం నిర్వహించి వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో రోగులు, బాలింతలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

- ఇచ్ఛాపురం

ప్రజల మదిలో మారాజు వైఎస్సార్

దశాబ్దాలు గడిచినా దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల మదిలో రారాజుగా ఉన్నారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. టెక్కలిలో గల వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఆయన బాటలోనే వైఎస్ జగన్ సంక్షేమాలు అందించారని గుర్తు చేశారు.

- టెక్కలి



టెక్కలిలో మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చింతాడ మంజు తదితరులు

క్లుప్తంగా

'ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయాలి'



జెడ్పీ వద్ద ధర్నా చేస్తున్న ఉత్తరాంధ్ర సాధన సమితి ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉత్తరాంధ్ర జిల్లాలను అభివృద్ధి చేయాలని, రాజకీయ నిర్లక్ష్యం ఉండకూడదని డిమాండ్ చేస్తూ ఉత్తరాంధ్ర సాధన సమితి ఆధ్వర్యంలో మీకోసం హాల్ వద్ద సోమవారం ధర్నా చేశారు. 75 ఏళ్లుగా ఈ ప్రాంతం వెనుకబాటుకు గురైందని, ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ధర్నాలో వేమిరెడ్డి లక్ష్మున్నాయుడు, గోవిందరావు, వెంకటరమణ, అప్పారావు కూర్మానాయకులు తదితరులు ఉన్నారు.

'విద్యార్థినులు అత్యున్నత స్థాయికి చేరుకోవాలి'



మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ గోవిందనాయుడు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థినులు అత్యున్నత స్థాయికి చేరుకోవాలని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జి.గోవిందనాయుడు అన్నారు. కళాశాలలో సోమవారం 10వ తరగతి ప్రతిభ ఆధారంగా అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) ఎంపిక చేసిన మెరిట్ స్కాలర్‌షిప్ 2024-25 పొందిన ఏడుగురు విద్యార్థినులు, రెన్యువల్ పొందిన విద్యార్థినులు 13 మందిని ప్రత్యేకంగా అభినందించారు. వీరికి రూ. 50 వేలు ఏడాదికి మెరిట్ స్కాలర్‌షిప్ అందుతుందని ప్రిన్సిపాల్ చెప్పారు. ప్రణాళికాబద్ధంగా విద్యార్థులు శ్రమించి చదవాలని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉన్నత అవకాశాలు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు.

జీడిపంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

సోంపేట: రాష్ట్ర ప్రభుత్వం జీడిపంటకు గిట్టుబాటు ధర కల్పించి, రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.మోహనరావు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని మామిడిపల్లి గ్రామంలో జీడి పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. 80 కిలోల బస్తాకు రూ.16 వేలు అందించాలని డిమాండ్ చేశారు. కేరళ తరహాలో జీడి బోర్డులు ఏర్పాటు చేయాలని, స్థానిక జీడిపిక్కలు కొనుగోలు చేసిన తర్వాతే విదేశీ జీడిపిక్కలకు అనుమతి ఇవ్వాలన్నారు. జిల్లా కమిటీ సభ్యులు కె.నాగమణి, మండల కన్వీనర్ సంగారు లక్ష్మీనారాయణ, పాతిన కృష్ణమూర్తి, పార్టీ నాయకులు, రైతులు పలువురు పాల్గొన్నారు.

మిషన్ శక్తి పోస్టర్ ఆవిష్కరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా జిల్లాలో మహిళల అభ్యున్నతికి మిషన్ శక్తి సంకల్ప్ (మహిళా సాధికారత కేంద్రం), భారతీయ న్యాయ సంహిత మొదలైన వాటిపై అవగాహన కల్పించే వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక పోస్టర్‌ను సోమవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ అవగాహనా కార్యక్రమాలు జూన్ 21 నుంచి అక్టోబరు 4 వరకు జరుగుతాయని పేర్కొన్నారు. జిల్లా స్థాయి, మండల స్థాయి, ప్రాజెక్టు పరిధిలో, అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

ఎస్‌ఎఫ్‌ఓఏ ఉపాధ్యక్షుడిగా బి.గోపాల్

పలాస: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫార్మసీ ఆఫీసర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మసీ ఆఫీసర్‌గా పనిచేస్తున్న బోనెల గోపాల్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తంనాయుడు, శ్రీకాకుళం ఫార్మసీ నాయకుడు సోమేశ్వరరావు, చక్రవర్తి, సుబ్రహ్మణ్యం, మల్లేశ్వరరావు, విజయ్‌మోహన్, గోవిందనాయుడు, నరసింహారావు, తులసి, దుర్గ, జిల్లా ఫార్మసీ ఆఫీసర్స్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

అధికారులపై ఎమ్మెల్యే చిర్రుబుర్రులు

కొత్తూరు: టెక్కలి సబ్ కలెక్టర్‌తో పాటు పలువురు అధికారుల తీరుపై పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు చిర్రుబుర్రులాడారు. ఆయన అంగూరు వద్ద ఇసుక పంపిణీ కోసం సోమవారం వచ్చారు. అయితే ఇక్కడ ఇసుక నిల్వలను పరిశీలించేందుకు ఈ నెల 6వ తేదీన టెక్కలి సబ్ కలెక్టర్‌తో పాటు రెవెన్యూ అధికారులు వచ్చారు. నిల్వల పరిశీలనకు వచ్చినప్పుడు ఎమ్మెల్యేగా తనకు కనీస సమాచారం ఇవ్వలేదని గోవిందరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై సబ్ కలెక్టర్ కూడా 'ఎమ్మెల్యేకు చెప్పనవసరం లేదు' అని చెప్పడంపై ఎమ్మెల్యే మండిపడ్డారు. అధికారులు తీరు మార్చుకోవాలని ఎమ్మెల్యే హెచ్చరించారు.

ఉపాధికి వేతన వేదన



మీ కోసం కార్యక్రమం వద్ద ధర్నా చేస్తున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం

- జిల్లాలో రూ.190 కోట్లకు పైగా బకాయిలు
- బకాయిలు చెల్లించాలని వేతనదారుల ధర్నా

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉపాధి హామీ వేతనదారులు వేతనం అందక ఇబ్బంది పడుతున్నారు. ఈ పథకం వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు వేతనదారులకు ఇబ్బంది ఉండేది కాదు. వారం పని చేస్తే వెంటనే ఆ బిల్లులు బ్యాంకు ఖాతాలో జమైపోయేవి. అయితే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విపక్ష పార్టీ నేతల ఆస్తుల ధ్వంసంపై పెడుతున్న శ్రద్ధ ఉపాధి వేతనదారుల సమస్యల పరిష్కారంపై పెట్టడం లేదు. వేతనదారుల కూలీలు కేంద్ర ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వేతనదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తారు. అయితే కొత్త ప్రభుత్వం ఈ నిధులు వేతనదారులకు అందజేయడం లేదు. గత పది వారాలుగా వేతనదారులకు డబ్బులు అందడం లేదు.

జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఈ ఏడాది మార్చి తర్వాత వేసవిలో ఉపాధి పనులు చేశారు. ప్రత్యామ్నాయ పనులు కూడా ఏవీ లేకపోవడంతో ఎక్కువ మంది ఉపాధిపైనే ఆధారపడ్డారు. మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఎక్కువ సంఖ్యలో పనులు చేశారు. ప్రస్తుతం ప్రతి రోజుకు సగటున 60 వేలు నుంచి 80 వేల మంది వరకు వేతనదారులు పనులు చేస్తున్నారు. మార్చి మొదటి వారం నుంచి ఇప్పటి వరకు ఈ వేతన దారులకు కూలి చెల్లింపులు జరగలేదు. మొత్తం రూ.190 కోట్లు వీరికి ఇవ్వాల్సి ఉంది. ఎన్నికల తర్వాత బకాయిలన్నీ వచ్చేస్తాయని వేతనదారులు ఆశ పడ్డారు. అయితే ప్రభుత్వం ఏర్పాటై నెల దాటినా ఉపాధి బిల్లుపై ఎవరూ ఏమీ మాట్లాడడం లేదు.

పని అడిగితే నిలుపుదల

టీడీపీ ప్రభుత్వ వచ్చి నెల రోజులు గడవక ముందే గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు కక్రపెత్తనం చెలాయిస్తున్నారు. వారిని నచ్చని వారికి, వైఎస్సార్ సీపీ సానుభూతి పరులను పనుల నుంచి వెలివేస్తున్నారు. వేతనాలు చెల్లించాలని కోరితే పనులు నిలుపుదల చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారు. కూలీలకు కనీసం 100 రోజులు పని కల్పించాల్సి ఉన్నప్పటికీ పని ఇవ్వడం లేదు.

బకాయిలు చెల్లించాలని ధర్నా

ఉపాధి వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని, రాజకీయ కక్షలు లేకుండా అడిగిన వారందరికీ పనులు కల్పించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం జెడ్పీ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం మీకోసం కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగరావు సింహాచలం, జిల్లా ఉపాధ్యక్షురాలు జి.ఈశ్వరమ్మ సంఘం జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏడుగురు హెచ్‌సీలకు ఏఎస్‌ఐలుగా ఉద్యోగోన్నతి

పేరు	పనిచేస్తున్న చోటు	పోస్టింగ్‌పై వెళ్లే చోటు
కె.ఆనందరావు	మందస పీఎస్	కాశీబుగ్గ
వై.మురళీ కృష్ణ	ఇంటిలిజెన్సు, ఏపీ	ఆర్డర్ రావాల్సి ఉంది
ఎం.బాలకృష్ణమూర్తి	స్పెషల్‌బ్రాంచి, శ్రీకాకుళం	శ్రీకాకుళం 2టౌన్
కె.వి.రమణమూర్తి	విజయనగరం జిల్లా	ఆర్డర్ రావాల్సి ఉంది
బి.గోవిందరావు	హిరమండలం పీఎస్	కొత్తూరు పీఎస్
ఎల్.అప్పారావు	మెళియాపుట్టి పీఎస్	పాతపట్నం పీఎస్
ఎ.చంద్రరావు	సీసీఎస్, శ్రీకాకుళం	కోటబొమ్మాళి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకు చెందిన ఏడుగురు హెడ్ కానిస్టేబుళ్లకు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లుగా (ఏఎస్ఐలు) ఉద్యోగోన్నతి కల్పిస్తూ విశాఖపట్నం రేంజి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీఐజీ) విశాల్ గున్నీ సోమవారం ఉత్తర్వులిచ్చారు. జిల్లాలోనే ప్రస్తుతముండే స్థానాలనుంచి వీరికి వేకెన్సీ ఉన్న ఆయా పీఎస్‌లలో పోస్టింగ్ ఇచ్చారు. ఎస్పీ రాధిక ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు.

ఎలక్ట్రికల్ దుకాణం పరిశీలన



హరిపురంలో కాలిపోయిన దుకాణాన్ని నాయకులతో కలిసి పరిశీలిస్తున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గంలో టీడీపీ నాయకులు కొత్త సంస్కృతికి నాంది పలుకుతున్నారని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. సోమవారం ఉదయం మందస మండలం హరిపురంలో గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేసిన దుకాణాన్ని పరిశీలించారు. పార్టీ నాయకులతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. మందస మండలం హరిపురం మెయిన్ రోడ్డుకు ఆనుకుని ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు జగన్నాథపురం పురుషోత్తంకు చెందిన ఎలక్ట్రికల్ షాపును గుర్తు తెలియని దుండగులు కాల్చేశారు. విద్యుత్ ఉపకరణాల దుకాణంపై అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో పెట్రోల్ బాటిల్ నిప్పుతో విసిరి దుండగులు పరారవడం చూస్తుంటే ప్లాన్ ప్రకారం చేశారని అర్థమవుతోందని మాజీ మంత్రి అన్నారు. టీడీపీ వారే ఈ దుశ్చర్యకి పాల్పడి ఉంటారని సర్పంచ్ పురుషోత్తం అనుమానం వ్యక్తం చేశారు. అ సమయంలో పెట్రోలింగ్ ఉన్న మందస పోలీసు స్టేషను ఏఎస్ఐ శేఖర్ సంఘటన స్థలం వద్దకు చేరుకుని షాపు యజమానితో పాటు పోలీసులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారని అన్నారు.

13న పూరి మారు రథయాత్రకు ప్రత్యేక బస్సు



పూరి యాత్ర బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు

శ్రీకాకుళం అర్బన్: మొట్టమొదటిసారిగా శ్రీకాకుళం జిల్లా కేంద్రం నుంచి ప్రఖ్యాత పూరి మారు రథయాత్రకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్ తెలిపారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ కార్యాలయ ఆవరణలో సోమవారం కరపత్రాలను, బ్యానర్లను శ్రీకాకుళం-1వ డిపో మేనేజర్ పీబీ మల్లికార్జునరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం నుంచి పూరి రథయాత్ర సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, ఈ ప్రత్యేక బస్సు ఈ నెల 13వ తేదీ రాత్రి 8 గంటలకు శ్రీకాకుళం బస్‌స్టేషన్ నుంచి బయల్దేరి 14వ తేదీ ఉదయం 5 గంటలకు పూరికి చేరుతుందని తెలిపారు. జగన్నాథ స్వామిని దర్శింపజేసి మళ్లీ మధ్యాహ్నం రెండు గంటలకు పూరిలో బయల్దేరి కోణార్క్ సూర్య దేవాలయానికి సాయంత్రం 3.30 గంటలకు వెళ్లి అక్కడ 6 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు శ్రీకాకుళం వస్తుందని తెలిపారు. యాత్రకు సంబంధించి మనిషి ఒక్కరికి ప్రయాణ టిక్కెట్ ధర రూ.2,200గా నిర్ణయించినట్లు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా కూడా టిక్కెట్లు బుక్ చేసుకునే సౌకర్యం కూడా ఉందన్నారు. మరిన్ని వివరాలకు 7382921647, 9959225608, 9959225609, 7382917289 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ శ్రీకాకుళం రెండో డిపో మేనేజర్ కె.రవిశంకరశర్మ, డిపో మేనేజర్, శ్రీకాకుళం 1వ డిపో అసిస్టెంట్ మేనేజర్ వెదుళ్ల రమేష్, అధికారులు రాజు, ఇజాజ్ తోటయ్య, సిమ్మయ్య ట్రాఫిక్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

'స్వచ్ఛందంగా అక్రమ మోటార్లు తొలగించుకోండి'

- అక్రమ మోటార్లు వినియోగిస్తున్న వారికి రెండోసారి నోటీసులు

ఎచ్చెర్ల క్యాంపస్: పూడివలసలో కూటమి నాయకులు ప్రభుత్వ బోర్లు, బావులకు అక్రమంగా ఆరు మోటార్లు ఏర్పాటు చేసి ప్లంబింగ్ ద్వారా ఇళ్లకు రన్నింగ్ నీటి సౌకర్యం ఏర్పాటు చేసుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, సర్పంచ్ జరుగుళ్ల కృష్ణారావు ప్రభుత్వ బోరుకు ఏర్పాటు చేసిన మోటార్‌ను గత నెల 28న కూటమి నాయకుల ఫిర్యాదు మేరకు అధికారులు తొలగించారు. సర్పంచ్ కూడా మిగిలిన వారిపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయగా అక్రమ మోటార్లు ఏర్పాటుచేసిన వారికి నోటీసులు ఇచ్చారు. కానీ ఉన్నతాధికారులు స్పందించకపోవటం, ఎమ్మెల్యే ఒత్తిడితో గ్రామ కార్యదర్శి సనపల సీతారామరాజు ఈ నెల రెండో తేదీన ఉద్యోగానికి రాజీనామా చేశారు. రాజీనామా ఫార్మేట్ సక్రమంగా లేని కారణంగా ఆమోదించలేదు. ఈ పరిస్థితులన్నింటిపై 'సాక్షి'లో 'మనిషికో న్యాయం..' శీర్షికన కథనం వెలువడింది. దీనికి అధికారులు స్పందించారు. గ్రామ కార్యదర్శి రాజీనామా ఆమోదించని కారణంగా ఆయన కొనసాగుతున్నట్లు స్పష్టం చేశారు. ఆరు మోటార్ల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈ నేపథ్యంలో మరో సారి గ్రామ కార్యదర్శి సోమవారం నోటీసులు జారీ చేశారు. సొంత ఖర్చులతో మోటార్లు స్వచ్ఛందంగా తొలగించు కోవాలని, లేదంటే పోలీసుల రక్షణతో తొలగించటం జరుగుతుందని నోటీసులో పేర్కొన్నారు. అక్రమ బోర్ల తొలగింపునకు రక్షణ కావాలని ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం 10 గంటల వరకు తొలగింపునకు సమయం ఇచ్చారు. గడువు ముగిశాక తామే తొలగిస్తామని తెలిపారు.

లైంగిక వేధింపుల నియంత్రణకు అంతర్గత ఫిర్యాదుల కమిటీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రతి కార్యాలయంలో మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన అధికారుల సమీక్షలో ఆయన మాట్లాడుతూ 2013లో ప్రవేశపెట్టిన పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల చట్టం (నివారణ, నిషేధం, దిద్దుబాటు)ను పటిష్టంగా అమలు చేయాల్సిన బాధ్యత ఆయా శాఖల ఉన్నతాధికారులపై ఉందని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు అన్న తేడా లేకుండా కనీసం పది మంది ఉద్యోగులున్న ప్రతి కార్యాలయంలో కమిటీని ఏర్పాటు చేసి, అందుకు సంబంధించిన వివరాలు ఐసీడీఎస్ కార్యాలయానికి పంపాలన్నారు. సచివాలయాల్లోనూ ఈ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. అలాగే జిల్లా స్థాయిలో ఒక కమిటీ (ఎల్‌సీసీ) పనిచేస్తుందని, పదిమంది కంటే తక్కువ మంది పనిచేసే సంస్థలు, కార్యాలయాలు ఉద్యోగులు ఈ కమిటీని సంప్రదించవచ్చని సూచించారు.

ఈ సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శాంతిశ్రీ మాట్లాడుతూ ఆ చట్టం గురించి పూర్తిస్థాయిలో వివరించారు. కమిటీ ఆవశ్యకతను తెలియజేశారు. జిల్లాలో ఇప్పటివరకు వివిధ శాఖలకు సంబంధించి 247 అంతర్గత కమిటీలను (ఐసీసీ) ఏర్పాటు చేశామని, జిల్లా స్థాయి, మండల స్థాయి, గ్రామ స్థాయిలో గల అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ సంస్థలలో ఈ కమిటీలు పనిచేస్తున్నాయని అన్నారు. అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయలేని సంస్థలు లేదా కార్యాలయాల్లో పని చేసే మహిళలు తమ ఫిర్యాదుల కోసం ఉమెన్ హెల్ప్ లైన్ 181, లేదా 9110793708 నెంబర్ కు ఫోన్ చేయడం ద్వారా, ఇంకా 1098 చైల్డ్ హెల్ప్ లైన్ సేవలను వినియోగించుకోవచ్చని అన్నారు. అలాగే ప్రతి సంస్థ అంతర్గత కమిటీలోని సభ్యుల పేర్లు, ఫోన్ నంబర్లను ఆఫీసులో అందరికీ కనిపించేటట్లు బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన తప్పనిసరి



కోర్టు ఆవరణలో ర్యాలీ చేస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు, న్యాయవాదులు, పోలీసులు, ఇతర సిబ్బంది

శ్రీకాకుళం పాతబస్టాండ్: హెల్మెట్ వినియోగంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు అన్నారు. సోమవారం జిల్లా కోర్టు ఆవరణ, స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద హెల్మెట్ ధారణపై అవగాహన సదస్సు, ప్రయాణికులతో భేటీ, అంతకు ముందు జిల్లా కోర్టు నుంచి డే అండ్ నైట్ కూడలి వరకు ర్యాలీ, డే అండ్ నైట్ కూడలి వద్ద వాహన దారులతో హెల్మెట్ వాడకం వినియోగం గురించి అవగహన సదస్సు నిర్వహించారు. మోటారు వాహన చట్టం గురించి సన్యాసినాయుడు వివరించారు. కార్యక్రమంలో జి.ఇందిర ప్రసాద్, అడ్వకేట్, మల్లికార్జున రావు, డిపో మేనేజర్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అవతారం తదితరులు పాల్గొన్నారు.

మహిళా కండక్టర్ నిజాయితీ



బాధితురాలికి బంగారు గొలుసు అందజేస్తున్న కండక్టర్ రీసు విజయకుమారి

టెక్కలి: టెక్కలి నుంచి పాతపట్నం రూట్‌లో ఆర్టీసీ బస్సులో బంగారు గొలుసు పోగొట్టుకున్న ప్రయాణికురాలికి తిరిగి గొలుసు అప్పగించి మహిళా కండక్టర్ రీసు విజయకుమారి తన నిజాయితీను చాటుకున్నారు. టెక్కలి నుంచి పాతపట్నం రూట్‌లో సోమవారం ఏపీ 29జెడ్ 0010 నంబర్ గల బస్సులో విజయకుమారి కండక్టర్‌గా వ్యవహరించారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో టెక్కలి నుంచి తెంబూరు వరకు అదే గ్రామానికి చెందిన పొట్నూరు రాణి ప్రయాణిస్తూ బంగారు గొలుసు పోగొట్టుకున్నారు. ఇంటికి వెళ్లి చూసేసరికి మెడలో గొలుసు లేకపోవడంతో ద్విచక్రవాహనం పై పాతపట్నం వరకు వెళ్లి బస్సులో గొలుసు కోసం వెతుకులాడారు. విషయం తెలుసుకున్న కండక్టర్ విజయకుమారి తనకు బస్సులో దొరికిన బంగారు గొలుసును చూపించి పూర్తి వివరాలు అడిగి తెలుసుకుని ఆ గొలుసు బాధితురాలు రాణిదేనని నిర్ధారణ చేసుకుని ఆమెకు గొలుసు అప్పగించారు. దీంతో బస్సులో ఉన్న తోటి ప్రయాణికులంతా కండక్టర్ విజయకుమారీ నిజాయితీని అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో జిమ్ ట్రైనర్ మృతి



ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహనం



చిన్ని దుర్గాప్రసాద్

నరసన్నపేట: స్థానిక హనుమాన్ నగర్‌కు చెందిన చిన్ని దుర్గాప్రసాద్ (22) రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు.. మారుతీ నగర్ మొదటి లైన్‌లో గొట్టిపట్టి వంతెన వద్ద జిమ్‌లో ట్రైనర్‌గా పనిచేస్తున్న దుర్గాప్రసాద్ సొంత పనిపై ఆదివారం శ్రీకాకుళం వెళ్లారు. రాత్రి తిరిగి ఇంటికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా మడపాం వంతెన వద్దకు వచ్చే సరికి బండి అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో దుర్గాప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమీపంలో ఉన్న ఎన్‌హెచ్ అంబులెన్స్ సిబ్బంది వెంటనే శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 11.30 సమయంలో మృతి చెందాడు. మృతుని తల్లిదండ్రులు బీద కుటుంబానికి చెందిన వారు. తండ్రి శ్రీనివాసరావు హోటల్‌లో పనిచేస్తుండగా తల్లి ఈశ్వరమ్మ ఇళ్లలో పనిచేస్తుంటుంది. అక్కకు వివాహమైంది. ఒక్క కుమారుడు ఈ విధంగా ప్రమాదానికి గురై మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. ప్రమాదంపై నరసన్నపేట ఎస్ఐ అశోక్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కారు బోల్తా



విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడిన కారు

టెక్కలి రూరల్: మండలంలోని మేఘవరం గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. మేఘవరం గ్రామానికి చెందిన గిన్ని మల్లేసు, పైల రాంబాబు అనే ఇద్దరు వ్యక్తులు కారులో టెక్కలి వైపు వస్తుండగా కారు ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తాపడింది. కారులో ఉన్న ఇద్దరూ స్వల్పంగా గాయపడ్డారు. వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు.

అటు వాన.. ఇటు నిరీక్షణ



వాహనాలన్నీ ఎందుకిలా ఆగిపోయాయి అనుకుంటున్నారా..? నందిగాం-తామరాపల్లి రహదారి వద్ద వీరు ఆగిన ముందు ప్రాంతం వరకు వాన కురిసి.. వీరు ఉన్న ప్రాంతంలో మాత్రం చినుకు కూడా పడలేదు. అడుగు దూరంలో వాన పడుతుంటే ఎండలో వీరు నిరీక్షించిన దృశ్యం సోమవారం అందరినీ ఆశ్చర్యపరిచింది. - వజ్రపుకొత్తూరు రూరల్

మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలి

- 2008, 1998 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి
- ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రంలో 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి, వెంటనే మధ్యంతర భృతి (ఐఆర్)ని ప్రకటించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్టేట్ టీచర్స్ యూనియన్(ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఐఆర్‌తోపాటు గత పీఆర్సీ బకాయిలు, పీఎఫ్ లోన్లు, సరెండర్ లీవ్ బకాయిలు ఇలా అన్ని ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం శ్రీకాకుళంలోని క్రాంతి భవనంలో ఎస్టీయూ శ్రీకాకుళం జిల్లాశాఖ కార్యవర్గ సమావేశం జరిగింది. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ రమణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వం నూతన విద్యా విధానంలో భాగంగా తీసుకొచ్చిన జీవో నంబర్ 117ను వెంటనే రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలను సమాంతరంగా నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై పని భారాన్ని తగ్గించి 30 పీరియడ్ల బోధనకు పరిమితం చేయాలని కోరారు.

యాప్ నిర్వహణ నుంచి ఉపాధ్యాయులను మినహాయించి వాటి నిర్వహణ కోసం డిజిటల్ అసిస్టెంట్లను నియమించాలని కోరారు. 2008, 1998 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ టీచర్లగా నియమించాలని డిమాండ్ చేశారు. ఎస్టీయూ జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యదర్శి డి.శ్యామ్ మాట్లాడుతూ ప్రభుత్వ బడులను కాపాడేందుకు అమ్మకు వందనం పథకాన్ని ప్రభుత్వ బడులకు మాత్రమే కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తమ్మినాయుడు, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ పట్నాయక్, ఆర్థిక కార్యదర్శి పేడాడ రామకృష్ణ, మహిళా కార్యదర్శి వసంతకుమారి, మైనార్టీ కన్వీనర్, ఉపాధ్యాయ వాణి, కన్వీనర్ జి.రమణ తదితరులు పాల్గొన్నారు.